క్లుప్తంగా

మండవల్లి ఎస్‌ఐగా రామచంద్రరావు



మండవల్లి: మండల ఎస్ఐగా సీహెచ్ఎస్ రామచంద్రరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. భీమవరం (డీసీఆర్‌బీ) డిస్ట్రిక్ట్ క్రైమ్ రికార్డ్ బ్యూరో నుంచి ఉన్నతాధికారులు ఈయనను మండవల్లికి బదిలీ చేశారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ టి.రామకృష్ణ తూర్పుగోదావరి జిల్లా రాజానగరం బదిలీ అయ్యారు.

ఎమ్మెల్యే డీఎన్నార్‌ను కలిసిన ఎస్ఐ

బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్ఐ రామచంద్రరావు, ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్)ను ఆయన స్వగృహం వద్ద మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు మొక్కను బహూకరించారు.

రేణుకా పరమేశ్వరుడికి అన్నాభిషేకం



పామర్రు: స్థానిక విజయవాడ రోడ్డులో అంకమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో రేణుకా పరమేశ్వరుని మార్గశిర మాసం ఆరుద్రనక్షత్రం సందర్భంగా బుధవారం అన్నాభిషేకం చేశారు. తొలుత ఆలయంలో స్వామికి పంచామృతాలతో అభిషేకాలను, ఆవుపాలతో క్షీరాభిషేకం చేశారు. అనంతరం రేణుకా పరమేశ్వరునికి అన్నా భిషేకం చేశారు. అన్నాభిషేకం చేసిన అన్న ముతో వచ్చిన భక్తులు అందరికీ అన్న సమారాధన నిర్వహించారు. ఆలయంలో పూజలను బేతనబొట్ల ఫణికుమార్, శ్యాముల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు వరదా అప్పారావు, సభ్యులు ఉమామహేశ్వరరావు, మేకా పేరయ్య, కోటి పాండురంగారావు భక్తులు పాల్గొన్నారు.

రోగులకు ఎమ్మెల్యే కైలే పరామర్శ

తోట్లవల్లూరు: ఆపదలో ఉన్న వారికి వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. తోట్లవల్లూరులో బుధవారం రాత్రి ఆయన విస్తృతంగా పర్యటించారు. అనారోగ్యంతో బాధపడుతున్న పలువురిని ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పరామర్శించారు. వారి యోగక్షేమాలను తెలుసుకోవటంతోపాటు ధైర్యంగా ఉండాలని సూచించారు. ఎంపీపీ ఈడ్పుగంటి రాజామణి, జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కళ్లం వెంకటేశ్వరరెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్ కిలారం శ్రీనివాసరావు, మండల రైతు విభాగం అధ్యక్షుడు యార్లగడ్డ శివయ్య, పీఏసీఎస్ అధ్యక్షుడు పడమట హరిప్రసాద్, సచివాలయ కన్వీనర్ కిలారం రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బీసీల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని
- బీసీ భవన నిర్మాణానికి స్థలం కేటాయింపునకు చర్యలు
- ఘనంగా గుడివాడ బీసీ సంఘ ప్రథమ వార్షికోత్సవం



పూలే దంపతుల విగ్రహాలకు నివాళులర్పించిన ఎమ్మెల్యే కొడాలి నాని, బీసీ సంఘాల నాయకులు

గుడివాడరూరల్: రాష్ట్రంలో బీసీల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు (నాని) పేర్కొన్నారు. గుడివాడ పట్టణంలోని జ్యోతిరావు పూలే దంపతుల విగ్రహాల వద్ద గుడివాడ నియోజకవర్గ బీసీ సంఘ అధ్యక్షుడు దారం నరసింహారావు ఆధ్వర్యంలో బుధవారం బీసీ సంఘ ప్రథమ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొడాలి నాని ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. తొలుత పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీల సంక్షేమానికి కృషి చేస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్నారు. బీసీ భవన నిర్మాణానికి రెండు వేల గజాల స్థలాన్ని కేటాయించేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘ మహిళా విభాగ అధ్యక్షురాలు యామిని యశోదాదేవి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావులకొల్లు మల్లేశ్వరరావు, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పుల్లయ్య, శాలివాహన కార్పొరేషన్ చైర్మన్ పురుషోత్తం, పార్టీ సీనియర్ నాయకుడు మండలి హనుమంతరావు, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు గొర్ల శ్రీను, జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు మెరుగుమాల కాళి, పార్టీ నాయకులు షేక్ సయ్యద్, చింతల భాస్కరరావు, నైనవరపు శేషుబాబు, దారం ఏడుకొండలు, అల్లం రామ్మోహనరావు పాల్గొన్నారు.

ఘనంగా శివ ముక్కోటి



గుడివాడలో స్వామివారికి పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు, భక్తులు

గుడివాడరూరల్: పట్టణంలో శ్రీభీమేశ్వరాలయంలో శివ ముక్కోటి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే భక్తులు ఆలయానికి చేరుకుని విశేష పూజలు నిర్వహించి స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్తర ద్వారం ద్వారా స్వామివారు తెల్లవారు జామున భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి, అమ్మవార్లకు వేద పండితులు ప్రత్యేక పూజలు చేసి అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, ఆలయ సిబ్బంది, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు: శివముక్కోటి వేడుకలు మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా జరిగాయి. తోట్లవల్లూరులోని శ్రీభ్రమరాంబ చెన్న మల్లికార్జున స్వామి ఆలయంలో శివముక్కోటి వేడుకలను నిర్వహించారు. బుధవారం వేకువజామున ప్రత్యేక పూజల అనంతరం స్వామి వారు ఉదయం 5.30 గంటలకు ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం గ్రామోత్సవం జరిగింది. ఆలయ ఈఓ హరిదుర్గా నాగేశ్వరరావు, గుమ్మస్తా శ్రీనివాసరెడ్డి పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు
గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్



గుడ్లవల్లేరు: ర్యాగింగ్ చేస్తే కఠిన చర్యలు తప్పవని గుడివాడ డీఎస్పీ పి.శ్రీకాంత్ హెచ్చరించారు. బుధవారం గుడ్లవల్లేరు వీవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ కళాశాలలో ర్యాగింగ్ నిరోధంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలని, చట్టవ్యతిరేక అంశాలకు దూరంగా ఉండాలని చెప్పారు. డీఎస్పీని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు సన్మానించారు. కార్యక్రమంలో ఎస్.ఐ జి.సత్యనారాయణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఏఎంసీ చైర్మన్‌గా కొల్లాటి ప్రమాణ స్వీకారం



కలిదిండి: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మట్టగుంట గ్రామానికి చెందిన కొల్లాటి సత్యనారాయణ గురువారం ప్రమాణ స్వీకారం చేయనున్నారు. వైస్ చైర్మన్‌గా బత్తిన కిషోర్, సభ్యులుగా ద్రోణాద్రి మహాలక్ష్మి, శీలం మార్తమ్మ, తుందర్రు రమేష్, ఇలికట్ల నాగలక్ష్మి, బేతాళ మణి, మోకా నాగరాజు, మామిడిశెట్టి శివనారాయణ, పాలంకి వెంకట సత్యనారాయణ, బొంతు కనకదుర్గ, మాచర్ల నాగార్జున, పెద్దిరెడ్డి పోచమ్మ, దేవరకొండ నాగమణి, కేశిరెడ్డి ప్రసాదరావు నియమితులయ్యారు. తన పదవికి సహకరించిన ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే డీఎన్నార్, ఎమ్మెల్సీ వెంకటరమణ, ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావులకు కృతజ్ఞతలు తెలిపారు.

పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీ



పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న గుడివాడ డీఎస్పీ శ్రీకాంత్

పమిడిముక్కల: శాంతి భద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకొంటున్నట్లు గుడివాడ డీఎస్పీ పి.శ్రీకాంత్ తెలిపారు. పమిడిముక్కల పోలీస్‌స్టేషన్‌ను బుధవారం వార్షిక తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. ఎస్ఐ కిషోర్‌కుమార్‌ను పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకొన్నారు.

చెరకు తోటలో పంటకోత ప్రయోగం



పమిడిముక్కల: హనుమంతపురం గ్రామంలో శొంఠి లక్ష్మణరావు అనే రైతు పొలంలో బుధవారం చెరకు పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఈ ప్రయోగంలో రైతు పొలంలో 43 టన్నుల దిగుబడి అంచనా వేశారు. జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి పంటకోత ప్రయోగాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి గణేష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, మాజీ ఎంపీపీ శొంఠి వెంకటేశ్వరరావు, వీఏఏ రవితేజ, వీఆర్వో శ్రీనివాసరావు, రైతులు పాల్గొన్నారు.

వీఏఏలకు అవగాహన



మండవల్లి: స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో బుధవారం గ్రామ వ్యవసాయ సహాయకులకు సమీక్షా సమావేశం నిర్వహించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు జి.వెంకటమణి మాట్లాడుతూ ఫెర్టిలైజర్ ఆన్‌లైన్ అమ్మకాలు పూర్తి చేయాలని సూచించారు. ఫిజికల్ స్టాక్, ఆన్‌లైన్ సేల్స్ సమానంగా ఉండాలని తెలిపారు. మినుము విత్తనాలు ఇచ్చిన రైతుల వివరాలు డి-కృషి యాప్‌లు పరిశీలించి ఎంట్రీ చేయాలని సూచించారు. మండల వ్యవసాయాధికారి షేక్ జరీనా మాట్లాడుతూ రబీ ఈ – క్రాప్ బుకింగ్ ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ఘనంగా కలశ జ్యోతుల మహోత్సవం



పామర్రు కలశ జ్యోతులను ఊరేగిస్తున్న భవానీలు

పామర్రు: భవానీల కలశ జ్యోతి మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత స్థానిక అంకమ్మతల్లి ఆలయం వద్ద నుంచి జ్యోతులను ఊరేగింపును ప్రారంభించారు. ఈ కలశ జ్యోతుల ర్యాలీ ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. గఫార్ సెంటర్ నుంచి శివాలయం, జమ్మిచెట్టు సెంటర్, గుడివాడ రోడ్డు మీదుగా స్థానిక నాలుగురోడ్ల కూడలి వరకు జ్యోతుల ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పామర్తి శివ మల్లేశ్వరరావు గురు భవాని, గురుమాత ఎస్.రత్నకుమారి భవాని, భవానీ దీక్షా పరులు బన్నీ భవాని, వీరాంజనేయులు, ప్రభు, నాగు, సాయి, లహరి, సీహెచ్ లక్ష్మీ భవాని, పండు భవానీలతో పాటు స్థానిక ప్రజలు ర్యాలీలో పాల్గొన్నారు.

ఓటీఎస్ పథకం పేదలకు వరం



గోపవరంలో ఓటీఎస్ పట్టాలను పంపిణీ చేస్తున్న ఎంపీపీ అడవి కృష్ణ

కైకలూరు: జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకం (ఓటీఎస్) పేదలకు వరమని ఎంపీపీ అడవి కృష్ణ అన్నారు. గోపవరం సచివాలయం వద్ద బుధవారం 49 మందికి ఓటీఎస్ పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి 10 సంవత్సరాల క్రితం గృహ నిర్మాణాలకు తీసుకున్న రుణాలను ఒకే విడతలో తక్కువ కట్టించుకుని రుణమాఫీ చేస్తోందన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉలిసి వసంత కుమారి, వైస్ ఎంపీపీ మహమ్మద్ జహీర్, వీఆర్వో రాజబాబు, సెక్రటరీ వెంకటేశ్వరరావు, గ్రామ పెద్ద ఉలిసి శ్యాంబాబు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే డీఎన్నార్‌కు అంగన్‌వాడీల వినతి



కైకలూరులో వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

కైకలూరు: తమ సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు ఎమ్మెల్యే డీఎన్నార్‌కు బుధవారం కైకలూరులో వినతి పత్రాన్ని అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే యూనియన్ నాయకులతో రాష్ట్ర ప్రభుత్వం చర్చలు జరిపిందని, ప్రభుత్వం ఎప్పుడూ అంగన్‌వాడీ కార్యకర్తలకు అండగా ఉంటుందని, త్వరలో సమస్యలు పరిష్కారమవుతాయని అన్నారు. కార్యక్రమంలో మండలంలోని అంగన్‌వాడీలు, ఆయాలు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

నేడు, రేపు క్యాంపస్ ఇంటర్వ్యూలు

మచిలీపట్నంటౌన్: స్థానిక బైపాస్‌రోడ్డులోని కృష్ణవేణి ఐటీఐ కళాశాలలో గురు, శుక్రవారాల్లో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె.రమేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఇన్ఫోసోర్స్ కంపెనీ ఆధ్వర్యంలో ఈ క్యాంపస్ ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. ఆ సంస్థ ఉద్యోగులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. తమ కళాశాలలో చదివే విద్యార్థులతో పాటు మచిలీపట్నం పరిసర ప్రాంతాల్లో ఐటీఐ అర్హత కలిగిన నిరుద్యోగులు, పదో తరగతి ఉత్తీర్ణులై పాలిటెక్నిక్ చదివిన వారు ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చు. అభ్యర్థులు ఆధార్ కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు తీసుకురావాలన్నారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న డీవైఈవో పద్మరాణి

గుడివాడరూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం అందజేసే సహకారాన్ని సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని డీవైఈవో పద్మరాణి పేర్కొన్నారు. స్థానిక గాంధీ మున్సిపల్ హైస్కూల్‌లోని విద్యార్థులకు బుధవారం స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీవైఈవో మాట్లాడుతూ చిన్న తనం నుంచే కష్టపడి చదివితే విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదుగుతారన్నారని చెప్పారు. విద్య ద్వారానే సమాజంలోనే ఉన్నతికి మూలమని తెలిపారు. అనంతరం మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు అల్లం రామ్మోహన్, హెచ్ఎం షేక్ జానీసాహెబ్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

50 మందికి కంటి వైద్య పరీక్షలు



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ మాజీ సభ్యులు హరీష, పక్కన బొల్లవరపు

పాములపాడు(పెదపారుపూడి): పీఏసీఎస్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచిత పరీక్షలు చేసి కళ్ల జోళ్లు ఇవ్వటం అభినందనీయమని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు మూల్పూరి హరీష అన్నారు. మండలంలోని పాములపాడు పీఏసీఎస్ వద్ద బుధవారం ఏలూరు ఆశ్రమం వైద్యులు ఏర్పాటు చేసిన నేత్ర వైద్య శిబిరాన్ని హరీష, పీఏసీఎస్ చైర్‌పర్సన్ బొల్లవరపు దాసు కలిసి ప్రారంభించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 50 మందికి పైగా రోగులకు వైద్య పరీక్షలు చేశారు. మందులు ఇచ్చారు. అవసరమైన వారికి రెండు రోజుల్లో కళ్లజోళ్లు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు మూల్పూరి చంద్రశేఖర్, కార్యదర్శి పి.కుమారి తదితరులు పాల్గొన్నారు.

సత్తా చాటుతున్న యువ క్రీడాకారులు

రెండో రోజు ‘ఆడుదాం ఆంధ్రా’



పామర్రులో షటిల్ బ్యాడ్మింటన్ ఆడుతున్న క్రీడాకారులు



మొవ్వలో కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



కలిదిండి మండలంలో వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

పామర్రు: గుడివాడ, పామర్రు, కైకలూరు నియోజకవర్గాల పరిధిలో ‘ఆడుదాం ఆంధ్రా’ ఆటల పోటీలు రెండో రోజు బుధవారం సచివాలయాల పరిధిలో ఉత్సాహంగా కొనసాగాయి. పామర్రు కంచర్ల రామారావు జెడ్పీ హైస్కూల్‌లో పామర్రు టౌన్ పరిధిలోని ఐదు సచివాలయాల్లో దరఖాస్తులు చేసుకున్న క్రీడాకారులకు కబడ్డీ, షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహించారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులను ఎంపిక చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి అప్పికట్ల జవహర్ బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ దేవిరెడ్డి ఆనంద్‌రెడ్డి, పీడీలు, పీఈటీ పాల్గొన్నారు.

తోట్లవల్లూరు: తోట్లవల్లూరు మండలంలో ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. పోటీల రెండో రోజైన బుధవారం తోట్లవల్లూరు, పెనమకూరు జెడ్పీ పాఠశాల క్రీడా మైదానాల్లో క్రికెట్, షటిల్ టోర్నమెంట్, మహిళా కబడ్డీ పోటీలు జరిగాయి. పోటీలను ఎంపీడీఓ తుంగల స్వర్ణలత, పంచాయతీ కార్యదర్శులు పుష్పనాథం, సత్యనారాయణ, సుభాష్‌కుమార్, సచివాలయ సిబ్బంది పర్యవేక్షించారు.

మొవ్వ: మండలంలోని 19 సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో ‘ఆడుదాం ఆంధ్రా’ ఆటల పోటీలు ఉత్సాహ వాతావరణంలో సాగుతున్నాయి. మండలంలోని మొవ్వ, కూచిపూడి, కోసూరు, కాజ, పెదసనగల్లు, నిడుమోలు, భట్లపెనుమర్రు గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని క్రీడా మైదానాల్లో క్రికెట్, ఖోఖో, షటిల్, వాలీబాల్, కబడ్డీ పోటీలను నిర్వహించారు. మొవ్వ గ్రామంలోని శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఈటీ రామారావు పర్యవేక్షణలో పురుషుల, మహిళా విభాగాల్లో జరిగిన కబడ్డీ పోటీలు బుధవారం ఉత్కంఠగా సాగాయి.

క్రీడలతో మానసికోల్లాసం..

గుడ్లవల్లేరు: రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంతో నిర్వహించే క్రీడల పోటీలతో యువతలో మానసికోల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం పెరుగుతుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్ అన్నారు. బుధవారం మండలంలోని 17 గ్రామ సచివాలయాల్లో ఆటల పోటీలు కొనసాగాయి. గుడ్లవల్లేరులో నిర్వహించే క్రీడలను శశిభూషణ్ సందర్శించి క్రీడాకారులను ప్రోత్సహించారు. ఎంపీడీఓ డి.శ్రీనివాస్, తహసీల్దార్ అబ్దుల్ రెహ్మాన్ సుల్తానా, ఏఎఎస్ఎమ్ అండ్ వీవీఆర్ఎస్ఆర్ హైస్కూల్ డైరెక్టర్ నారాయణం శ్రీనివాసమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కలిదిండి: మండలంలో గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో ‘ఆడుదాం ఆంధ్రా’ క్రీడా పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. కలిదిండి, కోరుకొల్లు, ఆరుతెగలపాడు, తాడినాడ, పెద్దలంక తదితర గ్రామాల్లో బుధవారం క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, మొత్తం 69 మ్యాచ్ జరిగాయి. తొలి దశలో జనవరి 9వ తేదీ నాటికి గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో పోటీలు పూర్తవుతాయని ఎంపీడీవో దినతేజ్ తెలిపారు. ‘ఆడుదాం ఆంధ్రా’ కార్యక్రమం ఇన్‌చార్జ్ డి.విజయరాజు, ఈవోపీఆర్డీ రాజారావు, పీఈటీలు రత్నంరాజు, కృష్ణకుమారి, లూయిస్ పోటీలను పర్యవేక్షించారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్రపై అవగాహన



పమిడిముక్కల: మండలంలోని అగినపర్రు గ్రామంలో బుధవారం వికసిత్ భారత్ సంకల్ప యాత్ర అవగాహన సదస్సు నిర్వహించారు. వికసిత్ భారత్ జిల్లా కో ఆర్డినేటర్ ప్రభాకర్ కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలతో రూపొందించిన క్యాలెండర్‌ను పంపిణీ చేశారు. ఈవోఆర్డీ కొండేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ కోట మణిరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు అక్కినేని సతీష్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యలమంచిలి గణేష్, కార్యదర్శి ప్రసాద్, ఎంఈఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కైకలూరు: కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ఆటపాకలో బీజేపీ ఆధ్వర్యాన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర బుధవారం జరిగింది. ఈవోపీఆర్డీ కిరణ్ అధ్యక్షతన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వేంపాటి విష్ణురావు, మండల ఇన్‌చార్జి కీర్తి వెంకట రామప్రసాద్, ఉపాధి హామీ ఏపీఎం శరణ్, ఉప సర్పంచ్ బావిశెట్టి పాములు, ఎస్సీ మోర్చా జిల్లా నాయకులు ఏసుపాదం, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి వేంపాటి గోవింద చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు కాల్దరి సూర్యనారాయణ, మైనారిటీ మోర్చా అధ్యక్షుడు షేక్ బాషా, బొల్లా శ్యామలరావు, బోయిన బాలాజీ, తానంకి సాయి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.